అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ

- ఆదాయం ఘనం–అభివృద్ధి శూన్యం
- పెరుగుతున్న పట్టణీకరణ
- అందుకు తగ్గట్టుగా వసతుల లేమి
- పూడిక తీయని డ్రైన్లు
- ప్రబలుతున్న అంటువ్యాధులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు



సొసైటీ పేటలో చెత్త చెదారంతో పూడుకుపోయిన డ్రైయిన్

గన్నవరం: నియోజకవర్గ కేంద్రమైన గన్నవరం గ్రామ పంచాయతీలో అస్తవ్యస్త డ్రెయినేజీ వ్యవస్థ కారణంగా ప్రజలు అవస్థలు పడుతున్నారు. పెరుగుతున్న గృహ సముదాయాలకు అనుగుణంగా గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ అభివృద్ధికి నోచుకోవడం లేదు. డ్రెయిన్లలో కనీసం పూడికలు కూడా తొలగించకపోవడం వల్ల మురుగునీటి పారుదల ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. ఫలితంగా గ్రామంలో ఎక్కడ చూసినా మురుగునీటి తటాకాలు దర్శనమిస్తూ పందులకు ఆవాసాలుగా, దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి. దీనివల్ల ఇళ్ల మధ్య అపరిశుభ్ర వాతావరణం తాండవిస్తోంది. తత్ఫలితంగా అంటువ్యాధులు ప్రబలుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డ్రెయినేజీ వ్యవస్థ క్రమబద్ధీకరణపై పాలకులు, అధికారులు దృష్టి సారించకపోవడం కారణంగానే ఈ సమస్య ఉత్పన్నమవుతోందని వాపోతున్నారు.

ఆదాయం ఘనం...అభివృద్ధి శూన్యం

మేజర్ గ్రామ పంచాయతీ గన్నవరంలో సుమారు 30 వేలకుపైగా జనాభా నివసిస్తున్నారు. సుమారు ఏడు వేలకు పైగా ఇళ్లు, అపార్టుమెంట్లు, గ్రూపు హౌస్‌లు ఉన్నాయి. గ్రామ పంచాయతీ వార్షిక ఆదాయం సుమారు రూ.4 కోట్లకు పైగా వస్తుంది. అయినప్పటికీ డ్రెయినేజీ వ్యవస్థ అభివృద్ధికి నిధుల కేటాయింపు అంతంతమాత్రంగానే ఉంటోంది. గ్రామంలో సుమారు 300కు పైగా వీధులు ఉండగా ఇప్పటి వరకు కేవలం 70 వీధుల్లో మాత్రమే పక్కా డ్రెయిన్ల నిర్మాణం జరిగింది. స్థానిక శ్రీనగర్ కాలనీ, రాయ్‌నగర్, ఇస్లాంపేట, గౌడపేట, యాదవులపేట, చింతలపేట, కొత్తపేటలో మాత్రమే కొంత మేర డ్రెయినేజీ వ్యవస్థ ఉంది. స్థానిక రామ్‌నగర్, ఎస్సీకాలనీ, ఉపాధ్యాయనగర్, కరెంట్ ఆఫీస్ ఏరియా, ఎస్టీ కాలనీ, దావాజిగూడెం, బుద్దవరం రోడ్డులో మురుగునీటి కాలువలు కూడా సక్రమంగా లేవు. కొన్ని ప్రాంతాల్లో డ్రెయిన్లు లేకపోవడంతో మురుగునీరు రోడ్ల పైకి చేరుతున్నాయి. గతంలో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ చొరవతో ఊర చెరువు, ఇస్లాంపేట పరిధిలో సీసీ డ్రెయిన్ల నిర్మాణం జరిగింది. ఇటీవల కొన్ని వీధుల్లో సీసీ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టారు. పట్టణంలోని మురుగునీరు బయటకు వెళ్లే విధంగా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవడం లేదు.

పెరుగుతున్న పట్టణీకరణ

గడిచిన పదేళ్లలో గన్నవరం గ్రామ పంచాయతీలో గృహ నిర్మాణాలు గణనీయంగా పెరిగాయి. పెరిగిన గృహాలకు అనుగుణంగా డ్రెయినేజీ వ్యవస్థను మాత్రం విస్తరించలేదు. దీంతో ఇళ్లలో నుంచి మురుగునీటి పారుదల లేక ఎక్కడికక్కడ స్తంభించిపోతోంది. గ్రామ పంచాయతీలో సుమారు 60 మందికి పైగా పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నప్పటికీ డ్రెయిన్లలో పూడికలు తొలగించడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. దీనివల్ల మురుగునీటి పారుదల లేక డ్రెయిన్లు తీవ్ర దుర్వాసన వెదజల్లుతున్నాయి. సాయంత్రం అయితే దోమల బెడద ఎక్కువగా ఉంటోందని, కనీసం దోమల నివారణ మందులు కూడా చల్లడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి డ్రెయినేజీ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

క్లుప్తంగా

పెనమలూరులో ఎరువుల దుకాణం తనిఖీ



పెనమలూరు: పెనమలూరు గ్రామంలో బుధవారం ఎరువుల దుకాణాన్ని వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీ చేశారు. వ్యవసాయ సహాయ సంచాలకుడు సునీల్, మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ గ్రామంలో ఎరువుల దుకాణం తనిఖీ చేసి స్టాకు వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఎరువుల దుకాణంలో ఎరువులు ప్రభుత్వం ప్రకటించిన ధరలకే విక్రయించాలని, అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అవసరం మేరకే ఎరువులు వాడాలి



పెనమలూరు: రైతులు అవసరాల మేరకే ఎరువులు వాడాలని మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ అన్నారు. ఆమె బుధవారం పెదపులిపాక, తాడిగడప గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు అధిక మోతాదులో ఎరువులు వాడరాదన్నారు. అనవసరంగా ఎరువులు వాడితే దిగుబడి ఖర్చులు పెరుగుతాయన్నారు. యూరియా సమస్య ఉన్నందున దానికి ప్రత్యామ్నాయంగా కాంప్లెక్స్ లేదా అమోనియా ఎరువులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, వీఏఏలు పాల్గొన్నారు.

ఆరు వేలమందికి అన్నమారాధన



పెనమలూరు: కానూరు గ్రామ శివాలయం సెంటర్‌లో వినాయకచవితి సందర్భంగా జరుగుతున్న శ్రీగణేష్ మహోత్సవ కార్యక్రమంలో బుధవారం భక్తులకు పెద్ద ఎత్తున అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో భక్తులకు స్వయంగా వడ్డించారు. అన్నదాన కార్యక్రమంలో దాదాపు ఆరు వేల మంది భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో నేతలు అన్నే శ్రావణ్‌కుమార్, పిడికిటి రామకోటేశ్వరరావు, గుమ్మడి విజయ్‌కుమార్, చిగురుపాటి దామోదర్, దాతలు, భక్తులు పాల్గొన్నారు.

రూ.1.08 లక్షలకు లడ్డూ వేలం



పెనమలూరు: పెనమలూరు చిన్నగుడి సెంటర్‌లో వినాయక ఉత్సవాలు ఘనంగా చేశారు. గత కొద్ది రోజులుగా వినాయకుడి విగ్రహం వద్ద వివిధ రకాల పూజలు చేశారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. బుధవారం స్వామివారి లడ్డూకు వేలంపాట నిర్వహించారు. గ్రామానికి చెందిన ఉయ్యూరు సత్యనారాయణ స్వామివారి లడ్డూను రూ.1.08 లక్షలకు పాట పాడి లడ్డూను కైవసం చేసుకున్నారు. అనంతరం కళాకారులు డప్పు వాయిద్యాలతో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనం పై ఉంచి గ్రామ వీధుల్లో ఊరేగించారు. రాత్రి స్వామివారిని నిమజ్జనం చేశారు. పల్లిపేటలో ఫ్రండ్స్ అండ్ ఫ్రండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో వినాయకుడి మండపంలో శ్రీలక్ష్మీగణపతి హోమం, పూజా కార్యక్రమాలు చేశారు.

రోడ్డు ప్రమాదంలో గోసాల వాసి దుర్మరణం

పెనమలూరు: గంగూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోసాలకు చెందిన గరికె బాబూరావు (50) బుధవారం వేకువజామున గంగూరు పవర్‌స్టేషన్ వద్ద విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి దాటుతుండగా బైక్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలవటంతో విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాబూరావు మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి అన్న కొడుకు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆధార్ కార్డు ఆధారంగా యూరియా సరఫరా చేయాలి

గన్నవరం: రైతులు, కౌలుదారులకు ఆధార్‌కార్డు ఆధారంగా యూరియా సరఫరా చేయాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీ లక్ష్మణ స్వామి బుధవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. పాస్‌బుక్, కౌలు గుర్తింపు కార్డు ఆధారంగానే యూరియా సరఫరా చేయాలనే నిబంధనల కారణంగా కౌలుదారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రస్తుతం సాగుదారుల్లో 90 శాతం మంది కౌలుదారులే ఉన్నారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు కారణంగా వీరిలో కేవలం 20 నుంచి 30 శాతం మందికి మాత్రమే అధికారులు కౌలు గుర్తింపు కార్డులను జారీచేశారన్నారు. దీనివల్ల గుర్తింపు కార్డులు లేని కౌలుదారులకు పీఏసీఎస్‌ల్లో యూరియా సరఫరా చేయడం లేదన్నారు. వీరంతా ఎరువుల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆధార్‌కార్డు ఆధారంగా యూరియా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలి

గన్నవరం: స్థానిక మత్స్యకార భవనంలో బుధవారం ఐసీడీఎస్ గన్నవరం ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ నాగపద్మావతి మాట్లాడుతూ బాలింతలు మంచి పోషక విలువలు కలిగిన ఆహారం ఎక్కువగా తీసుకోవాలని చెప్పారు. దీనివల్ల పుట్టే బిడ్డ ఆరోగ్యంగా ఉండడంతో పాటు రక్తహీనత వంటి సమస్యలను అధిగమించవచ్చని చెప్పారు.

సనత్‌నగర్‌కు రాకపోకలు బంద్



సనత్‌నగర్- ఆటోనగర్ రోడ్డు మూసివేసిన దృశ్యం

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని కానూరు సనత్‌నగర్– ఆటోనగర్ రోడ్డులో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సనత్‌నగర్–ఆటోనగర్ హద్దులో ఉన్న మురుగు డ్రైన్‌పై ఇటీవల కల్వర్టు పనులు మొదలు పెట్టి అసంపూర్తిగా వదిలేయటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. అధికారులు ఎవరూ స్పందించక పోవటంతో వాహనదారులు, వ్యాపారులు, కార్మికులు చాలా ఇబ్బంది పడుతున్నారు. వివరాల్లోకి వెళితే సనత్‌నగర్ యూసీ టీ స్టాల్ ఎదురుగా ఆటోనగర్ హద్దులో డ్రైనేజీ ఉంది. ఈ డ్రైనేజీలో మురుగునీరు పారుదల సక్రమంగా జరగటం లేదని తొలుత పైప్‌లైన్‌లు వేశారు. అయితే చెత్తా చెదారం పైప్‌లైన్‌లో పేరుకుపోవటంతో మురుగునీరు పారుదలకు అవాంతరం ఏర్పడింది. దీంతో డ్రైన్‌లో వేసిన సిమెంట్ పైప్‌లు తొలగించి దాని స్థానంలో కల్వర్టు నిర్మాణం చేశారు. కల్వర్టు పనులు నత్తనడకన దాదాపు మూడు నెలలు జరిగాయి. కల్వర్టు పనుల కారణంగా సనత్‌నగర్–ఆటోనగర్ రోడ్డును మూసివేశారు. దీంతో రాకపోకలకు తీవ్ర సమస్య తలెత్తింది. సనత్‌నగర్ నుంచి ఆటోనగర్‌లోకి వెళ్లాలంటే ఈ రహదారే ప్రధాన రహదారిగా ఉంది. దారి మూసివేయటంతో ఆటోనగర్‌లోకి వెళ్లాలంటే చుట్టూ తిరిగి వెళుతున్నామని స్థానికులు చెబుతున్నారు.

పనులు నిలిపివేత

కల్వర్టు పని ముగిసిన తరువాత దానిపై సిమెంట్ శ్లాబ్‌లు వేయాల్సి ఉంది. సిమెంట్ శ్లాబ్‌లు వేస్తే సనత్‌నగర్–ఆటోనగర్‌కు రాకపోకలు పునరుద్ధరించటానికి అవకాశం ఉంది. అయితే కల్వర్టుపై సిమెంట్ శ్లాబ్‌లు వేయకుండా వదిలేశారు. ఇలా అధికారులు ఎవరూ ప్రజల సమస్యలు పట్టించుకోవటం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. వెంటనే కల్వర్టుపై సిమెంట్ శ్లాబ్‌లు వేసి సనత్‌నగర్–ఆటోనగర్‌కు రాకపోకలు పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

నూతన మూల్యాంకన విధానం బోధనకు గొడ్డలిపెట్టు



దావాజిగూడెంలో సభ్యత్వ పత్రాలు అందజేస్తున్న ఎస్టీయూ నేతలు

గన్నవరం: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలో నూతనంగా ప్రవేశపెట్టిన మూల్యాంకన విధానం ఉపాధ్యాయుల బోధనకు గొడ్డలి పెట్టులా మారిందని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి దేవరపల్లి విద్యాసాగర్ తెలిపారు. మండలంలోని అల్లాపురం, దావాజిగూడెం, గన్నవరం, కేసరపల్లిలోని పాఠశాలలో బుధవారం రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలను ఎస్టీయూ నేతలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యాసాగర్ మాట్లాడుతూ విద్యా రంగంలో ప్రభుత్వం తీసుకువస్తున్న సంస్కరణలు ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తున్నాయని చెప్పారు. నూతన మదింపు విధానంలో మౌఖిక పరీక్షల్లో విద్యార్థుల ప్రతిస్పందన నమోదుకు వందలాది పేజీలు రాయాల్సి వస్తోందన్నారు. అసెస్మెంట్ పుస్తకాల నమోదుకే పది రోజులు పడుతుంటే ఇంకా విద్యార్థులకు బోధించే సమయం ఎక్కడుంటుందని ప్రశ్నించారు. ఇప్పటికైనా మూల్యాంకన విధానంలో మార్పులు చేపట్టాలని కోరారు. గతంలో మాదిరిగానే తరగతి గదిలోనే మౌఖిక పరీక్షలకు విద్యార్థుల ప్రతిస్పందన ఆధారంగా మార్కులు వేసే విధానం తీసుకురావాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కొత్తగా ప్రవేశపెట్టిన విద్యాశక్తి ప్రోగ్రాంపై స్పష్టత లేకుండానే అదనపు తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులపై ఒత్తిడి చేయడం సమంజసం కాదన్నారు. ఈ ప్రోగ్రాంను ఉపాధ్యాయులందరూ బహిష్కరిస్తున్నట్లు ప్రభుత్వానికి స్పష్టం చేవారు. ఎస్టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోత్రు ఆనంద్‌కుమార్, రావెళ్ళ అనంద్‌కుమార్, ఆర్థిక కార్యదర్శి చిమటా కృష్ణారావు, జిల్లా నాయకులు దొవరి సురేష్, బొకినాల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర భూసర్వేను సద్వినియోగం చేసుకోండి

కలెక్టర్ డీకే బాలాజీ



పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ

ఉయ్యూరురూరల్: సమగ్ర భూ సర్వేను సమర్థంగా నిర్వహించాలని కృష్ణాజిల్లా కలెక్టర్ డాక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. మండలంలోని బోళ్లపాడు గ్రామంలో జరుగుతున్న సమగ్ర భూ సర్వేను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పంచాయతీ కార్యాలయంలో భూ సర్వేకి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో, రైతులతో సర్వే నిర్వహిస్తున్న తీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. సమగ్ర భూ సర్వే చాలా ప్రాధాన్యత సంతరించుకుందని, సర్వేలో అవకతవకలకు పాల్పడితే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నో ఏళ్లుగా భూవివాదాలు, సరిహద్దు వివాదాలతో రైతులు ప్రజలు ఇబ్బందులు పడుతున్న పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రత్యేక సమగ్ర భూ సర్వే గ్రామ గ్రామాన నిర్వహిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పర్యటనలో జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, ఉయ్యూరు ఆర్డీఓ షారోన్, తహసీల్దార్ సురేష్ కుమార్, భూ సర్వే డెప్యూటీ తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు, వీఆర్వో రవిరెడ్డి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

రసాయనిక ఎరువులు మోతాదుకు మించి వాడొద్దు

నున్న(విజయవాడరూరల్): రసాయనిక ఎరువులను మోతాదుకి మించి వాడొద్దని వ్యవసాయ శాఖ ఏడీఏ బి.వెంకటేశ్వరరావు రైతులకు సూచించారు. నున్న గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ వరిపంట ఎకరానికి అరబస్తా చొప్పున మూడు దఫాలు మాత్రమే వాడాలన్నారు. అవసరమనుకుంటే నానో యూరియాను వాడుకోవచ్చునని తెలియజేశారు. ప్రస్తుతం చెదురు మదురుగా వర్షాలు కురుస్తుండటంతో గాలిలో నత్రజని ఉంటుంది కాబట్టి పురుగుమందులను కూడా వాడవద్దని రైతులకు సూచించారు. ప్రస్తుతం వరి పంట ఆరోగ్యకరంగా ఉందని ఎలాంటి తెగుళ్ల లేవన్నారు. మండల వ్యవసాయాధికారి కె.రఘు మాట్లాడుతూ వరిపంట సాగు చేస్తున్న ప్రతి రైతు ఈ క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయాలన్నారు. ఉద్యానశాఖ అధికారి పరమేశ్వరరెడ్డి ప్రభుత్వ పథకాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, సొసైటీ సీఈఓ రమేష్‌బాబు, రైతులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగ చిన్నారులకు వితరణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: చెవిటి, మూగ దివ్యాంగ చిన్నారులకు ఎంతో ఓర్పుతో విద్యాబుద్ధులు నేర్పుతూ, వసతి కల్పిస్తున్న ఆదిత్య సంస్థ నిర్వాహకులు అభినందనీయమని లయన్స్‌క్లబ్ ఆఫ్ హనుమాన్‌జంక్షన్ అధ్యక్షుడు పంచకర్ల రమేష్ చక్రవర్తి అన్నారు. స్థానిక నూజివీడురోడ్డులోని ఆదిత్య బధిరుల విద్యా శిక్షణాలయానికి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బియ్యం, నిత్యవసర సరుకులతో పాటుగా రూ.5 వేలు నగదును మంగళవారం ఆయన అందజేశారు. క్లబ్ సీనియర్ సభ్యుడు మేడికొండ బుచ్చిబాపయ్య సతీమణి జయప్రద జ్ఞాపకార్థం ఈ విరాళాన్ని ఆదిత్యలోని చెవిటి, మూగ విద్యార్థులకు పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ సభ్యులు నందిగం వెంకటేశ్వరరావు, మూల్పూరు సురేంద్ర కుమార్, అక్కినేని రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి



ప్రసంగిస్తున్న వీరయ్యచౌదరి

పెనమలూరు: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదివితే వృత్తిలో రాణించగలుగుతారని సిద్ధార్థ డీమ్డ్ టుబీ యూనివర్సిటీ కులపతి, మాజీ సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ కొసరాజు వీరయ్య చౌదరి అన్నారు. కానూరు సిద్ధార్థ న్యాయ కళాశాలలో బుధవారం విద్యార్థులతో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. విద్యార్థులు జీవిత లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆధునిక పుస్తక జ్ఞానంతో పాటు ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానంపై కూడా విద్యార్థులకు పట్టు ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చెన్నుపాటి దివాకర్‌బాబు మాట్లాడుతూ నిరంతర నైపుణ్య సాధనతోనే వృత్తిలో రాణించగలుగుతారన్నారు. కార్యక్రమంలో ఉపకులపతి డాక్టర్ పరుచూరి వెంకటేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు



మన గ్రోమోర్ ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు సిబ్బంది

కంకిపాడు: అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని వ్యవసాయ శాఖ పామర్రు ఏడీ స్వర్ణలత స్పష్టం చేశారు. కంకిపాడు పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను బుధవారం వ్యవసాయశాఖ, రెవెన్యూ, పోలీసు శాఖల బృందాలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయా దుకాణాల్లోని ఎరువుల నిల్వలు, స్టాకు రిజిస్టర్లను తనిఖీలు చేశారు. ఎరువుల విక్రయాల్లో అక్రమాలకు తావిస్తే చర్యలు ఉంటాయన్నారు. ఎమ్మార్పీ ధరలకే ఎరువులు విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని స్పష్టంచేశారు. తనిఖీల్లో సీఐ జె.మురళీకృష్ణ, తహసీల్దార్ వి.భావనారాయణ, ఏఓ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

బాల్యం నుంచే మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాల్యం నుంచే మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకుంటే భవిష్యత్‌లో ఆరోగ్య సమస్యలు దరిచేరకుండా, ఆనందమయ జీవితాన్ని ఆస్వాదించవచ్చని మెడివ్యాలీ హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ పి.సుధ తెలిపారు. స్థానిక నూజివీడు రోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమాన్‌జంక్షన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు పోషక విలువలతో కూడిన సమతుల ఆహారంపై అవగాహన కల్పించారు. అనంతరం దాదాపు 300 మంది చిన్నారులకు చెవి, ముక్కు, గొంతు, దంత వైద్య పరీక్షలు ఉచితంగా అందించారు. మెడివ్యాలీ హాస్పిటల్స్ వైద్య సిబ్బంది, లయన్స్‌క్లబ్ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా జరుగుతున్న గణపతి ఉత్సవాలు

గన్నవరం: మండలంలోని పలు గ్రామాల్లో గణపతి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. స్థానిక కోనాయి చెరువు సమీపంలోని శ్రీకాశీవిశాలాక్షి అన్నపూర్ణదేవి సహిత విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం శ్రీలక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. తొలుత కాసన్నేని శ్రీనివాసరావు దంపతులు శ్రీసిద్ధి వినాయకునికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ జరిపారు. స్థానిక రాయ్‌నగర్‌లో గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన చేశారు. కేసరపల్లిలోని శ్రీగంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో కల్యాణ విఘ్నేశ్వరుని సన్నిధిలో సాయంత్రం భక్తులతో దీపాలంకరణ జరిపారు. దావాజిగూడెంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో పలువురు దంపతులతో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సాహితీవేత్త కోకా విమలకుమారి మృతి



కోకా విమల కుమారి (ఫైల్)

విజయవాడ కల్చరల్: నగరానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త కోకా విమలకుమారి (82) బుధవారం మృతి చెందారు. ప్రభుత్వ వ్యాయామ అధ్యాపకురాలిగా ఆమె పనిచేశారు. 50 సంవత్సరాలుగా సాహితీసేవ చేస్తూ 20 పైగా పుస్తకాలను ప్రచురించారు. 1988లో అప్పటి ముఖ్యమంత్రి చేతులమీదుగా ఉగాది పురస్కారం, 1995లో తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ కవయిత్రి పురస్కారం 2000 సంవత్సరంలో ఢిల్లీ తెలుగు అకాడమీ పురస్కారం అందుకున్నారు. ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ కళాపీఠం స్థాపించి సాహిత్యరంగంలో కృషి చేసిన మహిళలకు పురస్కారాలను అందజేశారు. ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి పదవితోపాటు నగరంలోని అనేక సాంస్కృతిక కళాసంస్థల అభివృద్ధికి కృషి చేశారు. ఆచార్య సి.నారాయణరెడ్డి, సినీ నటుడు తనికెళ్ల భరణి చేతులమీదుగా అవార్డులు అందుకున్నారు. నగరానికి చెందిన నవ్యాంధ్ర రచయితల సంఘం (కలిమి), ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం (చలపాక ప్రకాష్), కృష్ణా జిల్లా రచయితల సంఘం (డాక్టర్ జి.వి.పూర్ణచందు), ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ (కొల్లూరి, బోడి ఆంజనేయరాజు), వేముల హజరత్తయ్య గుప్తా, గుమ్మా సాంబశివరావు, వెన్నా వల్లభరావు, నృత్య కళాకారిణి కోకా విజయలక్ష్మి తదితరులు విమలకుమారి మృతికి సంతాపం తెలిపారు.

డాక్టర్ వరప్రసాద్‌కు ఐఆర్‌ఐఏ సత్కారం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఏషియన్ మస్క్యులో స్కెలేటల్ సొసైటీ అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన నగరానికి చెందిన డాక్టర్ వేమూరి నాగ వరప్రసాద్‌ను బుధవారం ఇండియన్ రేడియాలజికల్ అండ్ ఇమేజింగ్ అసోసియేషన్(ఐఆర్‌ఐఏ) ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. మహాత్మాగాంధీ రోడ్డులోని హోటల్ మినర్వా గ్రాండ్‌లో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జీవీ మోహన్ ప్రసాద్, సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ చలసాని కులదీప్, విజయవాడ చాప్టర్ అధ్యక్షుడు బి.రాజ్‌కుమార్ తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్‌ప్రసాద్ మాట్లాడుతూ ఏషియన్ మస్క్యులో స్కెలేటల్ సొసైటీ అధ్యక్షుడిగా డాక్టర్ వరప్రసాద్ నియామకం దేశానికే గర్వకారణం అన్నారు. రెండున్నర దశాబ్దాల కిందట ఏర్పాటైన ఈ సొసైటీకి ఇప్పటి వరకూ భారతీయులు ఎవరూ అధ్యక్షుడిగా వ్యవహరించలేదని, తొలిసారిగా తెలుగు వాడైన డాక్టర్ వీఎన్ వరప్రసాద్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించడం మనందరికీ గర్వకారణం అన్నారు. గతంలో జాతీయ స్థాయిలో ఐఆర్‌ఐఏ, ఐసీఆర్ ఐలకు అధ్యక్షులుగా వ్యవహరించి సమర్థమైన సేవలు అందించిన డాక్టర్ వరప్రసాద్ ఇప్పుడు ఆసియా ఖండానికి సేవలు అందించే అవకాశం దక్కిందన్నారు.

వైద్య విద్యార్థుల పరిశోధనలకు మృతదేహం అప్పగింత

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందిన జి.వరప్రసాదరావు మృతదేహాన్ని ఆయన కుటుంబ సభ్యులు వైద్య విద్యార్థుల పరిశోధనల కోసం సిద్ధార్థ వైద్య కళాశాలకు అప్పగించారు. ఈ మేరకు మృతుని సోదరుడు అశోక్‌కుమార్ అంగీకార పత్రాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావుకు అందజేశారు.

దాడి చేసి కుమార్తెను తీసుకువెళ్లాడని ఫిర్యాదు

పెనమలూరు: కానూరులో దంపతులపై ఓ వ్యక్తి దాడి చేసి వారి కుమార్తెను బలవంతంగా తీసుకువెళ్లాడని పోలీసులకు బుధవారం ఫిర్యాదు అందింది. దీంతో పోలీసులు ఆమేరకు కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం కానూరు సనత్‌నగర్‌కు చెందిన మహిళకు ఇద్దరు కుమార్తెలు. ఆమె రెండవ కుమార్తె (21)ను తనకు ఇచ్చి వివాహం చేయాలని అదే ప్రాంతానికి చెందిన జావేద్ వెంటపడసాగాడు. దీనికి యువతి తల్లిదండ్రులు అంగీకరించలేదు. మంగళవారం రాత్రి జావేద్ యువతి ఇంటికి వచ్చి దంపతులిద్దరిపై దాడి చేసి వారి కుమార్తెను తీసుకు వెళ్లాడు. ఈ ఘటన పై బాధిత తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.